చిన్నకథ

# రెండూ రెండే

పులిపాక సత్యనారాయణ

ఇదివరకల్లా యేంజరిగిందో యేమోకాని అనసూయ మీద మాధవరావుకి అంతగా మనసున్నట్లు కన్పించదు. అతనంటూన్న ప్రకారం, అసలు అనసూయ యింట్లో కాలుబెట్టిన్ది తడవుగా తను పూర్తిగా మారిపోతాట్ట. తపాలాద్వారా అసలు అనసూయని తను చాలావరకు అర్థంచేసుకున్నాట్ట. మరీ స్థిరంగా తెల్సుకోవాలంటే కొన్నిఘడియలు చాలుట.

—ఇహ, తను భార్యకి రవ్వంత అవకాశమైనా కలిగించలేదుట, తన్నర్థంచేసుకునేందుకు. పెండ్లిరోజుల్లోనైతేనేం, మూడు రాత్రుల్లోనైతేనేం, యిద్దరూ వొంటరిగా కల్సుకున్నప్పుడైతేనేం, చీట్లపేక వేస్తున్నప్పుడైతేనేం, అనసూయ ప్రవర్తనదో తరహాగావుందని, బహుశా అది పుట్టి పెరిగిన పంచయిచ్చే వూతతో కూడివుందనీ, స్థానబలిమే అనసూయకా అహమిచ్చిందనీ అంటాడు మాధవరావు.

నీభార్యన్నేను చూడలేదంటే అనసూయని తెచ్చిచూపించాడు! అసలు మనిషి మరీ బాగుంటుందా అంటే యింతకన్నా కొంచెం నాణ్యం అన్నాడు.

అనసూయకి, నీకు తెల్సో తెలీదోకాని. ఆత్మాభిమానం ఆత్మనమ్మకం జాస్తి. అసలవి ప్రతి స్త్రీకి వుంటాయనుకో. అనసూయ చదువుకుంది కావటంతో అవి మరీజాస్తీనూ, నన్నేలోకరావెయ్యాలని చూస్తోంది. మొగవాణ్ణి! తనలాంటి వ్యక్తిత్వం మరెవ్వరికీ వుండదనుకుంటుంది అనసూయ, అనుకున్నాడు మాధవరావు! అట్లా కనిపిస్తుంది మరి!

అనుకున్నట్లుగా అనసూయని దిగడ్చి వెళ్ళిపోయింది బండి. వస్తానని నేను బయల్దేరాను.

రంగనాథం బాడుగ యివ్వబోతుంటే అనసూయే చెల్లించింది. చదువుకున్న భార్యలు మర్యాదని భర్తల్తో సమానంగాపాటిస్తే వొక్క రంగనాథమే కాదు, ప్రతిభర్తకూడా కొంత కష్టపడ్తాడు!

'నువ్వు వొక్కర్తె వేవచ్చావా'

రంగనాథం మరెవరన్నా బజార్లోనే దిగి నడిచివస్తున్నారేమో అని అనుమానపడ్డాడు. మరి రెణ్ణిమిషాలుకి ఆ కాస్తయినా నేనేందుకనుకోవాలి, తప్పేకదూ? అనుకున్నాడు.

'ఎవర్నీ శ్రమపడవొద్దన్నాను'

'అహా!'

ఒక వుద్దేశమంటూ యేర్పడినతర్వాత ప్రతి ప్రవర్తన్లోనూ యేదో వొకదోషం కనిపిస్తూనే వుంటుంది! రంగనాథం అనసూయమీద అలాగే దోషాలు సృష్టించుకోటం మొదలుబెట్టాడు. ఉండుండి అనసూయకూడ భర్తమీద లోలోపల అపనిందలు వేస్తూనేవుంది! స్థిరంగా యెవరికీ యెవరిమీదా పట్టు చిక్కటంలేదు. వారివారి మనసు దోవలు విపరీతంగా నడుస్తున్నాయి.

అనసూయవచ్చి కూర్చుంది. చదువుతూ చదువుతూన్న రంగనాథం 'అలాకూర్చో' అన్నాడు. 'నువ్వింకా కోరుకోలేదు'

'మందు పుచ్చుకుంటున్నాడు. మీ పరీక్ష పోయిందిగామాల్ను'

'పోనియ్యి. అయినా నేను చదివితేగా. దేశం చూడబోతే యిలావుంది. చదవాలనుకుంటే తనకీ, తనదేశానికీ పనికిరాని పుస్తకాలుచదవాలి'

'అలా అనుకొని దేశాన్ని బాగుచేస్తున్నారా యెవరన్నా?'

'బాగుంది. అంతా పాలుబోస్తారనుకోని అంతా నీళ్ళుబోసినట్లుంది'

భర్త తనకన్నా యింకోటేదో లక్ష్యించతగ్గదనుకుంటున్నాడనుకుంది అనసూయ. కాని ప్రయత్నిద్దామనుకుంది.

రంగనాథానికి తల్లి, అనసూయకి అత్తావచ్చి భోజనానికి లెమ్మనిచెప్పింది.

భోజనాలదగ్గిర మామూలుగా విసుక్కున్నాడు రంగనాథం!

'ఎంతచెప్పినా వినరు. అంతా వెండిపళ్లేలలో తింటూన్నారా. అయినా మట్టి పల్లాలకి గతుక్కు గతుక్కోమంటుంది. ఈకంచం వద్దంటే వినరు!'

'అందరికీ లేదంటే దానికి నువ్వాకర్తవి'

'మంచిమాటన్నారు' అంది అనసూయ. అసలే భర్తప్రవర్తన ఆమెకొక్కంత యెద్దేవకలిగించింది! రంగనాథం చురచురా చూశాడు. విసిరి నేలకేసి కొట్టాలనుకున్నాడు గాని పక్కనభార్య! కొత్త గాదూ?

'సంగీతం నేర్చుకుంటున్నానా' అంది యింటామె.

'ఆ! ఫిడేలుకూడా తెచ్చాను. వినిపిస్తాలెండి!'

అనసూయ నన్నుచూసి నేర్చుకోమంటుంది భర్తని. పెద్దవాళ్ళతో నమ్రతగామాట్లాడని వాళ్ళని చూస్తే ఆపిల్లకి మంట!

'నువ్వు కిళ్లీలు బాగా తయారుచేస్తావే!'

'మా నాన్నగారిక్కి రోజూ నేనేగా కట్టి యియ్యటం?'

అనసూయ నవ్వుతూ చెప్పింది. ఎందుకానవ్వు? అసలు అబద్ధంచెప్పింది అనసూయ. భర్తని బుట్టలో వేసుకోవాలని భార్యలు!

తరువాత రెండుపాటలు వాయించి పాడింది. బాగానేవుంది గొంతు. కాని రంగనాథం కనీసం తలైనా వూపలేకపోయాడు. ఇలా భర్తల్ని మచ్చికచేసుకొని వాళ్ళకే యావాలేకుండా చేస్తారు భార్యలు. వాళ్ళ ఆదర్శాలన్నీ కూలిపోతాయి! అనుకున్నాడు.

పెద్దవాళ్లు చిన్నగా వెళ్ళినతర్వాత 'నువ్వింకా చదివితే బాగుండేది!' అన్నాడు రంగనాథం భార్య వంకచూస్తూ.

'నాకది ఆయిష్టం. హాయిగా సంసారజీవితం గడపాలనివుంది. అదీ కష్టంతోగూడిన పనేగా! సంసారంలోనే మునిగిపోయినవాళ్ళంతా నిర్భాగ్యులా లేకపోతే? మా యింటిముందు, వాళ్ళదాంపత్యం యెంత సుఖంగావుంటుందనుకున్నారూ?'

ఇదంతా చెప్పమని యెవడుకోరాడు. తనని మచ్చికచేసుకోవాలని యింత ప్రయత్నమూన్నూ! తన ఆదర్శాలు!

 USE ALWAYS "TREBLE CLOVER" SOAPS •

'ఇదంతా మీ వాళ్ళ ప్రోత్సాహమా?' అన్నాడు.

'నాకూ వ్యక్తిత్వమంటూ వుందిగదండీ!'

మావాళ్ళనే లెఖ్ఖలో అత్తారింటికొచ్చిన ఆడది గాదు అనసూయ! ఆరోజంతా రంగనాథం తన ఆదర్శాలు, తన అనసూయ, వీట్నిగూర్చి ఆలోచించాడు!

మర్నాడు తన బజార్నించి యింటికి వచ్చినపుడు యిలా వినిపించింది. 'మీకెందుకత్తయ్యా నేను చెయ్యగల్దును. మా అమ్మకావిద్యలో మంచిపేరు!'

రంగనాథం యీపన్నాగమంతా తననీ వొక సంసార తాపత్రయంలోదూకి పైకిచూడలేక ఆలాగే జాలించేవాణ్ణిగా చెయ్యాలని అనుకున్నాడు!

అనసూయే వొంటచేస్తే తను వొడ్డించాలనుకున్నాడు రంగనాథం. అంతకన్నా ప్రతీకారం లేదు. పైగా యెందుకు రుణగ్రస్తం! ఆలాగే వెళ్ళా గదిలో కూర్చున్నాడు.

పన్నెండయింది. అనసూయవచ్చి 'మీరిక లేవచ్చును' అన్నది. అప్పుడేమార్పు! చలిస్తే సంసారమేగతి!

కాని యెదురుమాట అన్లేక లేచాడు. ఏమంటాడు? అనేందుకసలు పైకనేటట్లుగా ఆలోచించాడాఅని!


విడుదలకు సిద్ధంగాఉన్నది!

మీ పట్టణంలోని మీ అభిమాన థియేటర్లో !!

బాంబేటాకీస్ మహత్తర సాంఘిక చిత్రం !!!

## "జ్వార్ భటా"

నటీనటులు :

మిస్ మృదుల & దిలీప్‌కుమార్ : వెండితెరపై ప్రధమ దర్శనం!!

డైరక్టర్ : అమియ చక్రబర్తి ('బసంత్' ఖ్యాతి)

మ్యూజిక్ : అనిల్ బిస్వాస్

గేయాలు : నరేంద్ర

*Release through:*

**EASTERN PICTURES,**

No. 133 C. Mowbries Road, Royapettah P. O. MADRAS.

అనసూయ నేను తరువాత కూర్చుంటానన్నది. పతిభక్తి! అదంటేనే అతనికసహ్యం! కాదు కూర్చో వాలన్నాడు? తల్లిని విస్తరివెయ్యమన్నాడు. అనసూయ కూర్చుంది.

కాని వూరుకోలేదు! నేచుకక్కవొడ్డించింది. అది కాస్తా నేలపాలైంది!

'ఇంతేనా?' అన్నాడు నవ్వుతూ రంగనాథం 'నేను వొడ్డిస్తానుచూడు. హోటల్లో సర్వింగ్ చేస్తున్నప్పుడు నేనెంతబాగా వొడ్డించేవాణ్ణనుకున్నావ్?'

రంగనాథం గమనిస్తూనే వున్నాడు. అనసూయముఖం ఆమాటకి వివర్ణమైపోయింది.

యువ ప్రచురణాలు, వెంకట్రామా అండ్ కో అన్ని బ్రాంచీలలోనూ, హిగిన్‌బాథమ్సు బుక్ స్టాల్సులోనూ న్యూస్ ఏజంట్లవద్దనూ దొరుకుతై. అలా దొరకనిపక్షంలో మాకు వ్రాసిన మేము పంపుతాము, రు, 10 0-0 విలువగల పుస్తకాలు ఒక్కమాటు తెప్పించేవారికి పోస్టు ఖర్చులు మేము భరిస్తాము. పుస్తకాలు కావలసినవారు మాకు వ్రాయండి.

యువ బుక్ డిపో

48 ఆచారప్పన్ స్ట్రీటు, మద్రాసు & తెనాలి

అయినా పస్తాయించక నేచుక్క వొడ్డించాడు!

ఆసాయంత్రం తల్లి కొడుకుని రహస్యంగా పిలిచి యిలాచెప్పింది 'దాన్ని నువ్వేం కష్టపెట్టావో ఆనక వెళ్తానంటుంది'

'అవును. నా ఆదర్శాలంటే దానికిష్ట మెలావుంటుంది'

రంగనాథం యీమాటని వచ్చేశాడు. దానికర్థంచెప్పలేదు తల్లికాతను! అలా గదిలోకివచ్చేసరికి అక్కడ అనసూయ.

అతనికిలా వినిపించింది.

'మీరు దేశసేవా దేశసేవా అంటారు. ఆదర్శాలంటారు. హోటల్లో ప్లేట్లందించగానే అవ్వన్నీ మీలో లీనమైనట్లే భావిస్తారు. నేను సుఖపడ్దామనివచ్చాను.'

రంగనాథం చెప్పాడు.

'ఆడది యింట్లో కాలుబెట్టగానే మొగవాడు పడేజాగ్రత్త యిది. లేకపోతే పిల్లాజల్లా వుద్యోగం, పాలపీకె, రవికా చీరే, యివ్వేగా పట్టుకొని పీడించేవి!'

'అట్లయితే'

'అంతే నేను నాఆదర్శాలు ఫలంపాటులేనివని తెల్సుకున్నరోజు, నువ్వు సంసారంకన్న ముఖ్యమైనవి ప్రపంచంలో మరికొన్నివున్నయ్యని గ్రహించిన్నాడు రానియ్యి! ఆనాడు కల్సుకుందాం!'

'అట్లయితే నేను వెళ్తాను'

'వెళ్లు'

'వెళ్తాను. అబద్ధంకాదు'

'నేనట్లా అనుమానపడలేను!'

'వెళ్తున్నా! వెళ్తున్నా'

'వెళ్ళు! వెళ్ళు!'

 USE ALWAYS "R. C." ASAFOETIDA.